ప్రమాదం వెంటే ప్రయాణం

- రోడ్డు పక్కన ఉన్న మట్టితోనే నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

చిలమత్తూరు: కాంట్రాక్టర్లు కాసులు మిగిలించుకోవడానికి వాహనదారులకు ప్రమాదాలను తెచ్చిపెడుతున్నారు. కొందరు టీడీపీ నేతలు మండలంలో బీటీ రోడ్లు , మట్టి రోడ్లు నిర్మిస్తున్నారు. అయితే రోడ్లకు వేసే మట్టిని చెరువులు, కుంటల నుంచి తెస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని రోడ్డు పక్కనే మట్టిని తోడేసి వేసేస్తున్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. రోడ్డుపై ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా వాహనాలు పక్కనే ఉన్న గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతోనే మండలంలో చాలా చోట్ల కాంట్రాక్టర్లు ఇలానే రహదారులు నిర్మిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు పక్కన ఉన్న గుంతలను ఇప్పటికైనా పూడ్చాలని వాహనదారులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


చిలమత్తూరు వడ్డిచెన్నంపల్లి సమీపంలో రోడ్డు పక్కన మట్టి తీయడంతో ఇలా..


చిలమత్తూరు మార్కెట్ యార్డులో సమీపంలో...



రోడ్డుపై వెళ్లాలంటే భయం

చిలమత్తూరులో నూతనంగా రహదారి వేశారు. ఈ దారి గుండా నిత్యం వెళ్తుంటాను. అయితే ఇప్పుడు అడుగడుగునా భయంతో వెళ్లాల్సి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద గుంతలు తవ్వేశారు. మార్కెట్ యార్డులో నిత్యం వాకింగ్, జాగింగ్, ఫుట్‌బాల్ ఆడుతుంటారు. ఇక్కడ కూడా రోడ్డును తోడటంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది.

– శంకర్‌రెడ్డి, చేనేపల్లి



బిల్లులు ఇవ్వకూడదు

మండలంలో ఇష్టానుసారం రోడ్లు వేస్తున్నారు. మట్టి రోడ్లు వేయాలంటే బయట నుంచి మట్టిని తీసుకొని వేయాల్సి ఉంటుంది. అయితే కాంట్రాక్టర్లు డబ్బు మిగుల్చుకోవడానికి రోడ్డు పక్కనే మట్టిని తీసి గుంతలు పెడుతున్నారు. దీంతో పొరపాటున ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకూడదు.

– వెంకట్‌రెడ్డి, దోరణాలపల్లి

క్లుప్తంగా

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న స్పెయిన్ దేశస్తులు

గోరంట్ల: కోరేవాండ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న సుమారు 65 మంది విద్యార్థులకు గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో స్పెయిన్ దేశానికి చెందిన దాతలు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చెట్ల ఆవశ్యకతపై ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జాన్ రెడ్డప్ప, ఆర్డీటీ ఎస్‌టీఎల్ రాంప్రతాప్ రెడ్డి, ఎటీఎల్ నరసింగరావు, పాఠశాల ఉపాధ్యాయులు అశోక్, సుధాకర్‌రెడ్డి, రాధ, కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ


మద్దనకుంటలో సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

గుడిబండ/ అమరాపురం: గుడిబండ మండలం మద్దనకుంట, అమరాపురం, అమరాపురం మండలం గౌడనకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా రాయాలని హెచ్‌ఎంలు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, అనిత విద్యార్థులకు సూచించారు.

నీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత


నీటి సరఫరాపై ఆరా తీస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్

పావగడ: పట్టణంలో నీటి కొరత లేకుండా అన్ని వార్డులకు క్రమం తప్పకుండా నీళ్లు సరఫరా చేయాలని స్థానిక మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ అధికారులకు సూచించారు. ఆయన గురువారం 7 వ వార్డు లోని రైస్ గేజ్ ఎక్స్‌టెన్షన్ లో నీటి సరఫరాపై స్థానికులతో ఆరా తీశారు. మోటారు పంపులు, పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతు చేసి నీరు సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బాల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం


మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పెనుకొండ: పట్టణంలోని ఎస్‌ఎల్‌వీ లాడ్జిలో గురువారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సకాలంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. లాడ్జిలో ప్లాస్టిక్ వస్తువులు మరికొన్ని వ్యర్థాలను ఓ గదిలో నిల్వ చేశారు. షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో వస్తువులు ఉన్న గది నుంచి మంటలు చెలరేగి, పొగ కమ్ముకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదంపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలిగా జయమ్మ


విజేతలను సన్మానించిన దృశ్యం

పావగడ: తాలూకాలోని నిడుగల్ హోబళి ముగదాళబెట్ట గ్రామం పాల ఉత్పత్తి మహిళా సహకార సంఘం అధ్యక్షురాలిగా జయమ్మ, ఉపాధ్యక్షురాలిగా ఆర్ రంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక పాల సంఘం కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రెండు స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఎలాంటి పోటీ లేకుండా వారిద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సీడీఓ వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను సంఘం డైరెక్టర్లు ఘనంగా సన్మానించారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు

అగళి: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు నిర్వాహకులకు సూచించారు. గురువారం ముత్తేపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా లెసన్ ప్లాన్స్ రాయాలన్నారు. విద్యార్థుల నోట్‌పుస్తకాలు కరెక్షన్ చేయాలన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

రొళ్ల: నసేపల్లిగొల్లహట్టి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. రోజూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని పిల్లలకు వడ్డించాలని ఎండీఎం నిర్వాహకులను ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి


ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ ఆనంద్ కుమార్

రొద్దం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్ గురువారం సందర్శించారు. ఇంటర్మీడియెట్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్ సోమశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మండల పరిధిలోని రొద్దకంపల్లి వద్ద జరుగుతున్న భూ రీసర్వేకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయశంకర్ రాజు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో పీజీ ఎంట్రెన్స్ రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు

హిందూపురం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పీజీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పీజీ చదువుతున్న విద్యార్థులకు అదే యూనివర్సిటీనే ప్రవేశ పరీక్ష నిర్వహించేలా చూడాలని కోరారు. ఎన్నికలవేళ తాము అధికారంలోకొస్తే ఎంట్రెన్స్ టెస్ట్ జీఓ 77ను రద్దు చేస్తామని ప్రస్తుత అధికార పార్టీ నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంత వరకూ అమలు చేయలేదని మండిపడ్డారు. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో ప్రవేశాలు నిర్వహించాలన్నారు. డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు విద్యార్థులు లేక మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, విద్యార్థి సంఘం నాయకులు పవన్, గోపి, జహీద్, నూర్, భానుప్రకాష్, అమీన్ పాల్గొన్నారు.

దుకాణాల వేళల్లో స్వల్ప మార్పులు

హిందూపురం అర్బన్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలను దృష్టిలో ఉంచుకొని దుకాణాలు, హోటళ్ల వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు డీఎస్పీ కేవీ మహేష్ గురువారం తెలియజేశారు. పట్టణంలో ఇప్పటి వరకు రాత్రి 10 గంటల వరకే హోటళ్లు, దుకాణాలు తెరిచి ఉంచేందుకు అనుమతి ఉండేదన్నారు. అయితే రంజాన్‌ను పురస్కరించుకొని శుక్రవారం నుంచి నుంచి రాత్రి 10:30 గంటల వరకు సమయం పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఇది రంజాన్ మాసం ముగిసే వరకే వర్తిస్తుందన్నారు.

జీత విముక్తుల సమస్యలు తీర్చండి


ఆందోళన చేపడుతున్న జీవిక సభ్యులు

పావగడ: జీత పద్ధతి రద్దు చట్టం అమలై ఇప్పటికి 44 ఏళ్లు పూర్తవుతున్నా ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ ఆ పద్ధతి గ్రామీణ ప్రాంతాల్లో తాండవమాడుతోందని జీత విముక్తి కర్ణాటక జిల్లా సంచాలకులు డీటీ సంజీవమూర్తి ఆరోపించారు. స్థానిక తాలూకా కార్యాలయంలో జీవిక నేతృత్వంలో గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి విముక్తులకు ప్రత్యేక మండలి ఏర్పాటు చేయాలని, 2017 నుంచి నేటి వరకు అర్జీలు అందించిన వారందరూ జీతగాళ్లుగా గుర్తించి వారంలోగా వారికి జీత విముక్తి పత్రాలు అందించాలన్నారు. గృహ సౌకర్యం, పింఛన్ అందివ్వాలన్నారు. వెట్టి విముక్తుల పిల్లలకు విద్యార్థి వేతనాలు అందివ్వాలన్నారు. వ్యవసాయానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు. జీవిక నాయకులు నరసింహమూర్తి, టీ హనుమంతరాయ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

రొళ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఒక సెట్ ప్రశ్నపత్రాలను విద్యాశాఖ అధికారులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. శుక్రవారం రెండో సెట్ కూడా ఉన్నత విద్యశాఖ నుంచి సరఫరా కానున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 8 ఉన్నత, ఒక కేజీబీవీ, ఒక ఏపీఆర్‌ఎస్‌తో పాటు రెండు ప్రైవేట్ పాఠశాలలు కలిపి 410 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారన్నారు. అందులో ఏ-సెంటర్(కేజీబీవీ)లో 200 మంది, బీ-సెంటర్(ఏపీఆర్‌ఎస్)లో 210 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 మోహన్, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

అగళి: పదో తరగతి ప్రశ్నపత్రాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం భద్రపరిచారు. మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు సంబంధించి మొదటి సెట్ ప్రశ్నపత్రాలు పోలీస్ లాకప్‌లో భద్రపర్చినట్లు అధికారులు తెలిపారు.

చిలమత్తూరు: స్థానిక పోలీస్ స్టేషన్‌కు పదోతరగతి ప్రశ్నపత్రాలు గురువారం చేరాయి. ఈ నెల 17 నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. మండల కేంద్రంలోని పీఎస్‌లో విద్యాశాఖ అధికారులు భద్రపరిచారు. ఈ మేరకు సెట్-1 ప్రశ్నపత్రాలు వచ్చినట్టు లేపాక్షి ఎంఈఓ నాగరాజు తెలిపారు. సెట్-2 ప్రశ్నపత్రాలు కూడా వస్తాయన్నారు.


రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్న పత్రాలు భద్రపరుస్తున్న అధికారులు

లేపాక్షి: 2025 విద్యా సంవత్సరంకు సంబంధించి 10వ తరగతి ప్రశ్న పత్రాలు సెట్-1 పేపర్స్‌ను స్థానిక లేపాక్షి పోలీసు స్టేషన్‌లో ఎంఈఓ నాగరాజు, కుళ్లాయప్పలతో పాటు ఉపాధ్యాయులు గురువారం భద్రపరిచారు.


చిలమత్తూరు పీఎస్‌లో పది ప్రశ్నపత్రాలు భద్రపరుస్తున్న విద్యాశాఖ అధికారులు

మడకశిర: మండలానికి సంబంధించిన పదో తరగతి ప్రశ్న పత్రాలను గురువారం అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో 1100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈఓలు శ్రీనివాస్, భాస్కర్ తెలిపారు.

నేటి నుంచి వేంకటరమణ స్వామి ఆలయంలో పూజలు

మడకశిర: పట్టణంలోని కోట వెంకటరమణ స్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు సంప్రోక్షణ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు వాస్తు హోమం, సాయంత్రం హోమాలు నిర్వహిస్తామన్నారు. శనివారం ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం రాజగోపురానికి భక్తులతో కుంభాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. సాయంత్రం స్వామి వారి కల్యాణం జరిపిస్తామని వివరించారు.

గ్రంథాలయం తనిఖీ

అమరాపురం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శితో సెస్సులపై చర్చించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగముని, గ్రంథాలయాధికారి ఇబ్రహీం పాల్గొన్నారు.

మామిడి చెట్లకు నిప్పు

పెనుకొండ: పట్టణ సమీపంలోని బెహలూల్‌సా దర్గా సమీపంలో మహిళా రైతు మైమున్నీసా బేగంకు చెందిన మామిడి తోటకు గురువారం గుర్తు తెలియని దుండుగులు నిప్పు పెట్టారు. సుమారు 20 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూ.50 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు మైమున్నీసా బేగం తెలిపింది.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

అమరాపురం: గౌడనకుంట గ్రామంలో వెలసిన దళితుల ఆరాధ్య దేవత కొల్హాపురి అమ్మవారి ఆలయంలో గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా ఘనంగా జరిగింది. తెల్లవారుజామున అర్చకులు వేద మంత్రోచ్చారణాల నడుమ అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠించారు. అనంతరం వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ.కెఎస్. నరసయ్య అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

మున్సిపల్ సుంకాల వేలం మళ్లీ వాయిదా

మడకశిర: మున్సిపల్ వేలం పాటలు మళ్లీ వాయిదా పడ్డాయి. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల, మార్కెట్, వారపు సంత, బస్టాండ్ పార్కింగ్ స్థలం సుంకాల వసూలుకు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. అయితే ఈ వేలంలో ఎవరూ పాల్గొనలేదు. దీంతో ఈనెల 12న ఉదయం 11 గంటలకు మళ్లీ వేలం పాటలను నిర్వహించనునట్లు కమిషనర్ ప్రకటించారు. ఈ వేలం పాటలు వాయిదా పడడం ఇది నాల్గోసారి కావడం గమనార్హం. వేలం పాటల డిపాజిట్ మొత్తాన్ని అధికంగా నిర్ణయించడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు సమాచారం.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గుడిబండ: బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎంపీడీఓ గంగాధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు లింగ వివక్ష చూపరాదన్నారు. బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. బాలికలు ఇష్టంతో చదువుకోవాలని సీడీపీఓ శాంతలక్ష్మీ తెలిపారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీదేవిని అంగన్‌వాడీ కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కమలమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ నియంత్రణకు చర్యలు


దొమ్మతమరిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్

పావగడ: తాలూకా వ్యాప్తంగా బర్డ్ ఫ్లూను నియంత్రించడానికి ముందు జాగ్రత్తగా ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లోని దొమ్మతమరి, నాగలాపురం గ్రామాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ హొరకేరప్ప తెలిపారు. గురువారం ఆయన దొమ్మతమరి చెక్ పోస్ట్‌ను పరిశీలించారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ తాలూకా ప్రజలు భయపడే అవసరం లేదని, ఇంత వరకు తుమకూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ కనిపించలేదన్నారు. అయితే చిక్కబళ్లాపురం, బళ్లారి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ కొంత మందికి సోకిందన్నారు. తాలూకాలో ఎక్కడైనా కోళ్ల ఫారాలలో ఎక్కువ సంఖ్యలో కోళ్లు చనిపోతే సమీప పశువైద్య కేంద్రాలకు సమాచారం అందివ్వాలన్నారు. తాలూకా వ్యాప్తంగా 90 కోళ్ల ఫారాలు 6 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయన్నారు.

చౌక దుకాణం తనిఖీ

రొళ్ల: ఎం.రాయాపురంలో ప్రభుత్వ చౌక దుకాణాన్ని గురువారం సాయంత్రం సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మి, ఆర్ఐ గిరియప్ప తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణంలో 9.97 క్వింటాళ్ల బియ్యం (బఫర్) తక్కువ ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో దుకాణాన్ని సీజ్ చేసి సరుకులను వీఆర్వోకు అప్పగించినట్లు వారు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ


సడ్లపల్లిలో స్వాతిని పరామర్శిస్తున్న టీఎన్ దీపిక

చిలమత్తూరు: హిందూపురంలోని 13వ వార్డు ఇన్‌చార్జ్ సడ్లపల్లి శబరీష్‌రెడ్డి సతీమణి, సచివాలయ కన్వీనర్ స్వాతికి ఇటీవల సర్జరీ జరిగింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక సడ్లపల్లికి వెళ్లి స్వాతిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శీన , సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్‌రెడ్డి, గంగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రశాంత్, మదన్, అబూబకర్, బేకరి శేఖర్, రాజు పాల్గొన్నారు.

నోటి ఆరోగ్య సంరక్షణ ప్రధానం


దంతాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిందూపురం: నోటి ఆరోగ్య సంరక్షణ ముఖ్యమని ఐడీఏ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విజయ్ బాబు తెలిపారు. గురువారం అంతర్జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులకు దంతసంరక్షణపై అవగాహన కల్పించారు. డాక్టర్ భారతి పట్టణంలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ పాఠశాల, డాక్టర్ నవీన్ ఎన్‌లైట్ డిగ్రీ కళాశాల, డాక్టర్ సురేఖాదేవి కదిరేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉచిత దంత పరీక్షలు, సంప్రదింపులు, నోటి ఆరోగ్య అవగాహన ప్రచారాలు నిర్వహించారు.